సాక్షి పల్నాడు

ఆదివారం । 24 । నవంబర్ । 2024



అన్నదానం

కారెంపూడి: స్థానిక వీరాంజనేయస్వామి దేవాలయంలో శనివారం వాసవి సేవాదళ్ ఆధ్వర్యాన 400 మంది భక్తులకు అన్నదానం చేశారు.



సత్యసాయి జయంతి వేడుకలు

మాచర్ల: సత్యసాయి విద్యావిహార్‌లో శనివారం సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ప్రార్థనలు చేశారు. అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి ఉన్నారు.



వైభవంగా సుబ్రమణ్యస్వామి కల్యాణం

కర్లపాలెం: ఎంవీరాజుపాలెంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

హాస్టల్ భవనం ప్రారంభించిన మంత్రి డోలా



వినుకొండ(నూజెండ్ల): గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. రూ.6 కోట్లతో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలో డిగ్రీ విద్యార్థుల కోసం గురుకుల కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవింద్‌బాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొన్నారు.

జాతీయ అదాలత్‌ను జయప్రదం చేయండి



నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్.సత్యశ్రీ కోరారు. శనివారం కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధికసంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజీ పడ దగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. న్యాయమూర్తులు ఎ.పూర్ణిమ, ఆశీర్వాదంపాల్, పల్లవి, సీఐ సీహెచ్ చరణ్, ఎస్ఐలు అశోక్, హరిబాబు పాల్గొన్నారు.

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి



విజయపురిసౌత్: నాగార్జునకొండలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు లాంచీలలో వెళ్లిన పర్యాటకులు కొండలోని వివిధ ప్రదేశాలను సందర్శించారు. ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు. శనివారం లాంచీల ద్వారా రూ.58,000 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



సత్తెనపల్లి: నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సత్తెనపల్లిలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం చిగురుపాడు గ్రామానికి చెందిన మేకల కీర్తన పట్టణంలోని వెంకటపతి నగర్‌లో గల సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో ఉంటూ పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల వేద కళాశాలలో నర్సింగ్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తుంది. శనివారం ఉదయం కళాశాలకు వెళ్లిన విద్యార్థిని మెట్లు ఎక్కుతూనే అలసటకు గురికావడంతో వెంటనే కళాశాల ప్రిన్సిపల్ వసతి గృహ వార్డెన్ రాణెమ్మకు ఫోన్ చేశాడు. వార్డెన్ రాణెమ్మతో పాటు కీర్తన సోదరుడు కూడా వచ్చి వైద్యశాలకు తరలించారు. ఆహారం తీసుకోకుండా కడుపు నొప్పికి మాత్రలు వేసుకోవడం వలన అస్వస్థతకు గురైనట్లు పేరెంట్స్ తెలుపుతున్నారు. 20 వరకు మాత్రలు మింగగా కొన్ని శరీరంలో కలిసిపోయాయని, మరికొన్ని వైద్యులు కక్కించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆత్మహత్యాయత్నానికి వ్యక్తిగత ఆరోగ్య సమస్యలు కారణమా? లేక మరేదైనా సమస్యలు ఉన్నాయా అనేది విద్యార్థిని వెల్లడించాల్సి ఉంది. సోదరుడికి సంబంధించిన వ్యక్తిగత వ్యవహారంలో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించినట్లు మరో వాదన ఉంది. పట్టణ పోలీసులు వైద్యశాలకు చేరుకొని వివరాలను సేకరించారు.

శిలాఫలకాలపై వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీల పేర్లు లేకపోవడంపై ఆందోళన

- టీడీపీ నాయకుల పేర్లు ముద్రించడంపై తీవ్ర అభ్యంతరం
- గురుకులాల్లో తాగునీటి కొరతపై ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీల ఆవేదన
- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంపై నిలదీత
- ప్రొటోకాల్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్న కేంద్ర మంత్రి పెమ్మసాని
- ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లలకు ఉచిత విద్య నిరాకరణపై సభ్యుల ఆగ్రహం
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ హెని క్రిస్టినా, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అధికారులు

జెడ్పీ సమావేశంలో ప్రొటోకాల్ రగడ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ ఉల్లంఘనపై సభ్యులు అధికారులను నిలదీశారు. జెడ్పీటీసీలకు తెలియకుండా ఎమ్మెల్యేల సిఫార్సులతో ఏకపక్షంగా పనులు చేపట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన సమావేశానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మూడు జిల్లాల అధికారులు హాజరయ్యారు.

శిలా ఫలకాలపై టీడీపీ నాయకుల పేర్లపై అభ్యంతరం

జెడ్పీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ప్రజాప్రతినిధులమైన తమ పేర్లు లేకుండా టీడీపీ నాయకుల పేర్లు రాయడంపై రొంపిచర్ల, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు ఓబుల్‌రెడ్డి, మస్తాన్‌రావు అధికారులను నిలదీశారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతి మండలం ఎనికేపాడు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలపై జెడ్పీటీసీ, సర్పంచ్‌ల పేర్లు రాయకపోవడంపై అధికారులు సమాధానం చెప్పాలని ఎంపీపీ మేకల హనుమంతరావు నిలదీశారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి యేసురత్నం మాట్లాడుతూ శిలాఫలకాలపై టీడీపీ నాయకుల పేర్లు రాసిన సంఘటనలు నియోజకవర్గ ఎమ్మెల్యేలకు తెలియకుండా జరగవని, దీనిపై అధికారులను బాధ్యులను చేయడం ద్వారా ప్రయోజనం లేదన్నారు. శిలాఫలకాలపై ముద్రించిన టీడీపీ నాయకుల పేర్లు తుడిచేందుకు ప్రయత్నించే సాహసాన్ని అధికారులు చేయలేరని అన్నారు. ఎమ్మెల్యేలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి, ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా చూడాలని అన్నారు. మరో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ప్రొటోకాల్‌పై కఠినంగా వ్యవహరించాలని, కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశానికి కూడా తనను ఆహ్వానించని విషయాన్ని గుర్తుచేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా చూస్తాం

ప్రొటోకాల్‌పై సభ్యులు లేవనెత్తిన అంశాలపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్లో ప్రొటోకాల్ సమస్యలు ఉత్పన్నం కాకుండా శాశ్వతంగా చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి దీనిపై చర్చించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశంలో రాజకీయపరమైన విభేదాలు వద్దని అన్నారు.

ఏకపక్షంగా అనుమతులు ఇవ్వడం తగదు

మండలంలో తనకు తెలియకుండా ఏకపక్షంగా పనులు మంజూరు చేయడంపై రొంపిచర్ల జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌ను నిలదీశారు. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో నేరుగా పనులు మంజూరు చేస్తే ఇక తామెందుకని ప్రశ్నించారు. జెడ్పీటీసీలకు తెలియకుండా పనులు కట్టబెట్టేసి, వాటిని ఆమోదించేందుకు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. దశాబ్దాల తరబడి ఉన్న సంప్రదాయాన్ని కాలరాశారని విమర్శించారు. హెనీ క్రిస్టినాతోపాటు సీఈవో వి.జ్యోతిబసు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.



సమావేశంలో ఎమ్మెల్సీలు ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, మర్రి రాజశేఖర్, హనుమంతరావు

- ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లలకు ఉచిత విద్య నిరాకరణపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని విద్యార్థులను ఫీజు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు పర్చారని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు స్పష్టం చేశారు.
- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాల మంజూరులో జరుగుతున్న అన్యాయంపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే బి.రామాంజనేయులు వ్యవసాయశాఖాధికారులను నిలదీశారు.
- అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ పేరుకే రాజధాని తప్ప అమరావతిలో జెడ్పీ హైస్కూల్ లేకపోవడం సిగ్గుచేటన్నారు. తాను ప్రతి సమావేశంలోనూ అధికారుల దృష్టికి తీసుకువస్తున్నా ప్రయోజనం శూన్యమన్నారు.
- ముట్లూరు జెడ్పీ హైస్కూల్లో 600 మంది విద్యార్థులు ఉండగా, బోధనేతర సిబ్బంది ఒక్కరూ లేరని, తక్షణమే నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు కోరారు.
- బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నిర్బంధ విద్యా హక్కుచట్ట ప్రకారం పేదల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించని పాఠశాలల వివరాలను బహిరంగ పర్చాలని, చట్టం అమల్లో క్షేత్రస్థాయిలో నెలకొన్న ఇబ్బందులను తన దృష్టికి తేవాలని మూడు జిల్లాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు.
- రొంపిచర్ల జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు అమ్మకు వందనం కింద రూ.15వేలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, ఆ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు.
- పలువురు జెడ్పీటీసీలు మాట్లాడుతూ మాచర్ల మండలంలోని ఎస్టీ బాలికల హాస్టల్లో టాయిలెట్ వసతి లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకుంటున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక టన్ను రూ.600 ఉంటే ప్రస్తుతం రూ.1,500 చేరిందని, ఇక ఉచితం ఎక్కడని నిలదీశారు. భట్టిప్రోలు పీహెచ్‌సీలో వైద్యులు మధ్యాహ్నం 12 గంటలకే వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. పాఠశాలల వద్ద విక్రయిస్తున్న నాసిరకం తినుబండారాల విక్రయాలను తక్షణమే ఆపి వేయాలని కోరారు. వట్టిచెరుకూరు రింగ్‌రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పల్నాడు జేసీ జి.సూరజ్ భరద్వాజ్ ధనుంజయ్, బాపట్ల జేసీ ప్రఖర్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు బాధ్యత సీసీఐదే

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

పత్తి కొనుగోలులో సీసీఐ అధికారులు ఇష్టారాజ్యంగా నిబంధనలు విధిస్తున్నారని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. నల్లకాయ వచ్చిందని, తడి చేరిందని రైతులు తెచ్చిన పత్తిని వెనక్కి పంపుతున్నారని, ఎటువంటి షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు తావు లేకుండా చూస్తామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు చేపడతామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని స్పష్టం చేశారు.

గురుకుల పాఠశాలల్లో తాగునీటి కొరతపై ఆగ్రహం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కాకుమానులోని ఎస్సీ గురుకుల పాఠశాలలో తాగునీటి కొరతపై ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నా, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ప్రతి సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నా శాశ్వత చర్యలు చేపట్టడం లేదని అన్నారు. ఇదే అంశంపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ బాలికల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు జెడ్పీ నిధులను పూర్తిస్థాయిలో కేటాయించాలని కోరారు. ఎస్ఆర్ఈజీఎస్‌తోపాటు నీతి ఆయోగ్ నిధులను హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేయగా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జోక్యం చేసుకుని నెలరోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

29న సీఆర్ కళాశాలలో జాబ్ మేళా

నరసరావుపేటఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన చిలకలూరిపేట గణపవరంలోని చుండి రంగనాయకులు కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ.తమ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు మాస్టర్‌మైండ్స్, రుద్ర కార్పొరేట్ సర్వీస్ (చెక్‌పోస్ట్), సింధుజ మైక్రో క్రెడిట్, కపిస్టన్ సర్వీసెస్ వంటి కంపెనీలు హాజరై అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయని వివరించారు. జాబ్‌మేళాకు 10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ, డిప్లమో, ఫార్మసీ, బీటెక్ చదువుకొని 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువత హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని తెలిపారు. వివరాలకు జె.సురేష్ (సెల్ నెం .9100566581), వీరాంజనేయులు (సెల్ నంబరు 9160200652)లను సంప్రదించాలని కోరారు.

అట్టహాసంగా ఖోఖో పోటీలు ప్రారంభం

ప్రారంభించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారెంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన బాల, బాలికల జట్ల క్రీడాకారులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ గౌరవవందనం స్వీకరిస్తూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించడం ద్వారా దేహదారుఢ్యంతోపాటు మానసిక వికాసాన్ని పొందవచ్చని, క్రీడల ద్వారా మంచి క్రమశిక్షణ అలవడుతుందని, విద్యాభ్యాసం కూడా మెరుగ్గా సాగుతుందన్నారు.

తొలి పోటీల విన్నర్స్

బాలుర విభాగంలో..

బాలుర విభాగంలో తొలి మ్యాచ్ గుంటూరు, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగింది. శ్రీకాకుళం జిల్లా జట్టుపై గుంటూరు జిల్లా జట్టు 12–11 తేడాతో విజయం సాధించింది. అనంతపురంపై విశాఖపట్నం జట్టు 17–15తో విజయం సాధించింది. నెల్లూరు జట్టుపై ఈస్ట్ గోదావరి జట్టు 15–13తో విజయం సాధించింది. వెస్ట్ గోదావరి జట్టుపై విజయనగరం జట్టు 14–7 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి.

బాలికల విభాగంలో...

బాలికల విభాగంలో కర్నూలు జట్టుపై వెస్ట్ గోదావరి జట్టు 10–6 తేడాతో విజయం సాధించింది. నెల్లూరు జట్టుపై విజయనగరం జట్టు 6–3తో విజయం సాధించింది. కృష్ణా జిల్లా జట్టుపై అనంతపురం జట్టు 15–1 తేడాతో గెలిచింది. గుంటూరు జట్టుపై కడప జిల్లా జట్టు 9–7 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. క్రీడాభిమానుల ఆనందోత్సాహాల మధ్య తొలి రోజు పోటీలు రసవత్తరంగా జరిగాయి.



ప్రాంగణంలో క్రీడాకారుల సందడి

- చిలకలూరిపేట బైపాస్ నిర్మాణం పూర్తి
- ఈ నెలాఖరు నాటికి ప్రారంభం
- 16.5 కిలోమీటర్ల పొడవున రూ.520 కోట్లతో నిర్మాణం
- భూమి నష్టపరిహారంగా మరో రూ.380 కోట్లు
- ముమ్మరంగా ముగింపు పనులు
- రయ్‌రయ్‌మంటూ దూసుకుపోనున్న వాహనాలు
- పేట ప్రజలకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

భళీర బైపాస్



చిలకలూరిపేట బైపాస్ రోడ్డు

నాదెండ్ల: చిలకలూరిపేట బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు ప్రారంభానికి రోడ్డు సిద్ధమైంది. ఈ నెల 28,29 తేదిల్లో ప్రారంభం కానున్నట్లు సమాచారం. 16.5 కిలోమీటర్ల పొడవున రూ.520 కోట్లతో నిర్మించిన బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే పేట ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. యడ్లపాడు మండలం తిమ్మాపురం నుంచి చిలకలూరిపేట రూరల్ మండలం తాతపూడి గ్రామం వరకూ 16.5 కిలోమీటర్ల పొడవున బైపాస్ రోడ్డు నిర్మించారు. 330 ఎకరాలను రైతుల వద్ద భూ సేకరణ చేసి రోడ్డు నిర్మాణం చేశారు. రైతులకు పరిహారంగా రూ.380 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ఈ 16.5 కిలోమీటర్ల పొడవున మూడు ఫ్లైఓవర్లు, ఆరు అండర్‌పాస్‌లు, రెండు మేజర్ బ్రిడ్జిలు, రెండు మైనర్ బ్రిడ్జిలు, మూడు బాక్సు కల్వర్టులు, 44 సిమెంటు పైపు కల్వర్టులు వేశారు.



గణపవరం-నాదెండ్ల డొంకలో అండర్‌పాస్

ఆరు లైన్లతోపాటు సర్వీసు రోడ్లను నిర్మించటంతో వాహనాల రాకపోకలకు ఎక్కడా అంతరాయం కలగకుండా సాగనున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు నిర్మాణం చేశారు.

రహదారికి ఇరువైపులా సోలార్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. రోడ్డు పరిధిలో రెండు చోట్ల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. పగలు సూర్యరశ్మి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి రాత్రి వేళల్లో గ్రిడ్ నుంచి విద్యుత్ తీసుకుని వీధి లైట్లు వెలగనున్నాయి. దేశవ్యాప్తంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులతో పాటూ ఇప్పటికే ఉన్న రహదారుల వెంబడి సోలార్ వీధిలైట్లు ఏర్పాటు చేయనున్నట్లు నేషనల్ హైవేస్ అధికారులు తెలిపారు.


పచ్చని చెట్లు, పూలమొక్కలతో సుందరంగా..

బైపాస్ రోడ్డు ఇరువైపులా గానుగ, వేప, నల్లమద్ది, గుల్మోరా, పెంట్‌ఫామ్ జాతుల మొక్కలు నాటారు. ఇప్పటికే మూడున్నర వేల మొక్కలను నాటారు. రోడ్డుకు ఇరువైపులా అంచుల వెంబడి గ్రీన్ టర్ఫింగ్ గ్రాస్ ఏర్పాటుచేశారు. రహదారి ఆక్రమణలకు గురికాకుండా రెండు వైపులా ప్రహరీ నిర్మించారు. ప్రతి మొక్కకు ట్రీగార్డ్ ఏర్పాటుచేసి సంరక్షించనున్నారు. వీటికి ప్రతినిత్యం నీటిని అందించేందుకు రెండు చోట్ల బోరు పాయింట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించనున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చురుగ్గా పనులు

యడ్లపాడు మండలం తిమ్మాపురం నుంచి చిలకలూరిపేట మండలం తాతపూడి వరకూ 2009లో జాతీయ రహదారి బైపాస్ నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ అనుమతి ఇచ్చింది. బైపాస్‌కు భూములు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు ఆధ్వర్యంలో బైపాస్ వ్యతిరేక పోరాటాన్ని రైతులు చేపట్టారు. బైపాస్ ప్రాజెక్టు అనుమతులు 2011లో రద్దయ్యాయి. తిరిగి 2016లో మరోసారి బైపాస్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. రైతులు మరోసారి ఉద్యమించటంతో పాటూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులను సమన్వయం చేసి మెరుగైన నష్టపరిహారం అందించి భూ సేకరణ చేశారు. బైపాస్ నిర్మాణం ప్రారంభమైంది. కరోనా కారణంగా కొంతమేర పనులకు అంతరాయం కలిగినా 2021 నుంచి పనుల్లో వేగం పుంజుకుంది.

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు



చిలకలూరిపేట బైపాస్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాం. రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీ, సోలార్ విద్యుత్ లైట్లు, అండర్ పాస్‌ల వద్ద సోలార్ బ్లింకర్స్, జీబ్రాలైన్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. 16.5 కిలోమీటర్ల మేర 3,500 మొక్కలు నాటాం. గ్రీన్ టర్ఫింగ్ గ్రాస్ వేశాం. నేషనల్ హైవే అథారిటీ ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు రోడ్డు ప్రారంభించనున్నాం.

– మురళీమోహన్‌రావు, చిలకలూరిపేట బైపాస్ రోడ్డు ప్రాజెక్టు డైరెక్టర్

క్లుప్తంగా

కోర్టు ఆవరణలో అగ్నిప్రమాదం

సీజ్ చేసిన ఐదు ద్విచక్రవాహనాలు దగ్ధం

నరసరావుపేటటౌన్: అగ్ని ప్రమాదంలో ఐదు ద్విచక్ర వాహనాలు దగ్ధమైన సంఘటన శనివారం కోర్టు ఆవరణలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను కోర్టులో అప్పగించారు. వాటిని ఆవరణలో భద్రపరిచారు. వాహనాల పక్కనే ఉన్న చెత్త కుప్పపై విద్యుత్ తీగల ద్వారా వ్యాపించిన నిప్పు రవ్వలు పడ్డాయి. మంటలు చెలరేగి పక్కనే ఉన్న ఐదు వాహనాలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ మేరకు న్యాయ శాఖ ఉద్యోగి జి.ఆంజనేయరెడ్డి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్ చరణ్ తెలిపారు.

నెలాఖరులోపు ఎన్‌పీసీఐ ఆధార్ మ్యాపర్ చేయించుకోవాలి

రేపల్లె రూరల్: ఎన్‌పీసీఐ ఆధార్ మ్యాపర్‌ను ఈనెల 30వ తేదీలోపు చేయించుకోవాలని రేపల్లె పోస్టల్ కార్యాలయ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు లబ్ధిదారులకు తెలిపారు. పట్టణంలోని నేతాజీనగర్, కూరగాయాల మార్కెట్, పీర్లపంజా సెంటరులోని సచివాలయాలలో శనివారం నిర్వహించిన స్పెషల్ క్యాంప్‌లను ఆయన పరిశీలించి మాట్లాడారు. నగదు బదిలీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులైన వారు పొందాలంటే ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. సమీపంలోని పోస్టాఫీసులలో ఈ అనుసంధాన ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారుడు ఆధార్, ఫోన్ నంబరుతోపాటు వివరాలను తెలియజేసి రూ.200 చెల్లించాలని సూచించారు. నెఖారులోపు ఎన్‌పీసీఐ తప్పక చేయించుకోవాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

- ఎస్పీ కె.శ్రీనివాసరావు
- అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు

నరసరావుపేట: ఇటీవల దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించటానికి ప్రతి పోలీసు అధికారికి అవగాహన తప్పనిసరిగా అందాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సైబర్ క్రైమ్‌పై పోలీసు అధికారులు, సిబ్బందికి తెలుగు సైబర్ ఆర్మీ ఫౌండర్, సీఈవో, సైబర్ క్రైమ్ అడ్వయిజర్, ఇన్వెస్టిగేటర్ రామాంజనేయులుచే అవగాహన కల్పించారు. సైబర్ క్రైం ప్రాధాన్యత, అవి జరిగినప్పుడు వెంటనే పోలీసు అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, వాటిని ఎంతవరకు నిర్మూలించి ప్రజలకు ఏవిధంగా సహాయం చేయవచ్చనే అంశాలపై వివరించారు. సైబర్ నేరాలు చేసిన నేరస్తులను గుర్తించి నేరాలను నియంత్రించటం, సోషల్ మీడియాలో



సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేటర్ రామాంజనేయులును సన్మానిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అసభ్యకరమైన, తప్పుడు పోస్టులను సర్క్యులేట్ చేసే వారిపై నిఘా ఉంచి వాటిని అరికట్టే విధానం, నిందితులను గుర్తించడంలో ఐపీ అడ్రస్, ఐపీడీఆర్‌లను అవగాహన చేసుకునే విధానాలను తెలియచేశారు. అవగాహన కలిగించిన రామాంజనేయులును ఎస్పీ సత్కరించి అభినందించారు. సీఐలు, ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షకు 463మంది విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈవో పురుషోత్తం

చందోలు(కర్లపాలెం): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం రూ.12వేలు స్కాలర్‌షిప్ అందజేస్తుందని డీఈవోఎస్ పురుషోత్తం తెలిపారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్‌ఎంఎంఎస్ మోడల్ టెస్ట్ నిర్వహించారు. బాపట్ల జిల్లాలోని పలు మండలాల నుంచి మొత్తం 463 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులను చదువులలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ మోడల్ టెస్ట్ నిర్వహిస్తుందని తెలిపారు. నిజాంపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన పి.సాకేత్ 122 మార్కులతో ప్రథమ, మన్యం లక్ష్మీధర్ 119 మార్కులతో ద్వితీయ, పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వై.దినేష్‌నాగసాయి 116 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వరుసగా రూ.1500, రూ.1000, రూ.500లను మెమెంటోతో కలసి డీఈవో అందజేశారు. మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.500 చొప్పున అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు, పీవీపాలెం ఎంఈవో వెంకటేశ్వరరావు, నిజాంపట్నం ఎంఈవో శోభాచంద్, స్థానిక పాఠశాల హెచ్‌ఎం కనకవల్లి, ఎస్టీయూ నాయకులు, అమర్‌నాథ్, నరసింహారావు, వెంకటేశ్వరరావు, నూర్ బాషా సుభానీ, పిట్టలవానిపాలెం, నిజాంపట్నం ఎస్టీయూ అధ్యక్షులు సాంబశివరావు, తులసీదాస్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కక్షిదారులను రాజీ పర్చండి

పిడుగురాళ్ల: డిసెంబర్ 14వ తేదీన పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టులో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులను రాజీపరిచే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీగంగాధరరావు అన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమంపై జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. కుమారస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ చైర్మన్ ఎం.మురళీగంగాధరరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ ఉపయోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు వేగవంతం చేయాలని సూచించారు. క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదాలు, లిటికేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించునే అవకాశం ఉన్నందున కక్షిదారులకు ముందస్తుగానే సమాచారం అందించి రాజీ పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కక్షిదారులు రాజీ పడటం వలన సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామిరెడ్డి, ఎస్‌కే మౌలాలి, ఎం.వెంకటేశ్వర్లు, జి.రమేష్, ప్రశాంతి, కుమార్ నాయక్, అప్పారావు, పిడుగురాళ్ల, మాచవరం పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీగంగాధరరావు

250 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



చీరాల: అక్రమంగా తయారు చేస్తున్న బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఒంగోలు ఆదేశాల మేరకు ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది, చీరాల, బాపట్ల ఎక్సైజ్ సిబ్బంది శనివారం చీరాల ఆదినారాయణపురం, రామ్‌నగర్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఆదినారాయణపురం, రామ్‌నగర్‌లో నాటుసారా తయారు చేసేందుకు డ్రమ్ముల్లో సిద్ధం చేసిన 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేయడం, అమ్మడం నేరమని, తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముత్తూట్‌లో రూ.18.50 లక్షలు అవకతవకలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ముత్తూట్ రెడ్ బ్రాంచ్‌లో రూ.18.50 లక్షలు అవకతవకలు జరిగినట్లు ముత్తూట్ విజిలెన్స్ బృందం నిర్ధారించినట్లు సమాచారం. శుక్రవారం 15 మంది ఖాతాదారులను విచారించగా రూ. 17 లక్షలు అవకతవకలు జరిగినట్లు తేలాయి. శనివారం మరో నలుగురు ఖాతాదారులను విచారించగా రూ.1.50 లక్షలు అవకతవకలు జరిగినట్లు తెలిసింది. ముత్తూట్ విజిలెన్స్ సెల్ బృందం ఖాతాదారులందరినీ విచారించి అవకతవకలను నిర్ధారించనుంది.

25న జిల్లాస్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్–2024 నిర్వహించనున్నారు. ఈ నెల 25న పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చెత్త నుంచి సంపద తయారు చేయడం అనే అంశంపై విద్యార్థులచే వివిధ రకాల నమూనాలను రూపొందించి, ప్రదర్శించేలా సైన్స్ ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని సూచించారు. ''పర్యావరణ కాలుష్యం – నివారణకు జాగ్రత్తలు''అనే అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించి సర్టిఫికెట్, బహుమతులు అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గైడ్ టీచర్ సహాయంతో పోటీలకు పంపాలని కోరారు. సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా (7842869407)ను సంప్రదించాలని సూచించారు.

అనుమానంతో భార్య హత్య


తుపాకుల శివపార్వతి

పెదసనగల్లు (మొవ్వ): మొవ్వ మండలం పెదసనగల్లు గ్రామంలో భార్యపై అనుమానంతో భర్త పచ్చడి బండతో తలపై కొట్టి హత్య చేశాడు. ఈ ఘటన శనివారం వేకువజామున వెలుగు చూసింది. కూచిపూడి ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల మేరకు.... పెదసనగల్లు గ్రామానికి చెందిన శివ పార్వతి (32)కి గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, బండారుపల్లి గ్రామానికి చెందిన తుపాకుల అశోక్‌తో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ సంతానం, వీరు పెదసనగల్లు గ్రామంలో నివాసం ఉంటున్నారు. శివపార్వతి కూచిపూడిలోని బిర్యానీ హోటల్‌లో పనిచేస్తోంది. భర్త అశోక్ పామర్రు మండలం పరిశేపల్లి గ్రామంలో ఒక రైతు వద్ద పని చేస్తున్నాడు. అశోక్ మద్యానికి బానిసై తరచూ శివపార్వతిని అనుమానిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి పెదసనగల్లులో ఇంటి వద్ద నిద్రపోతున్న శివపార్వతి తలపై పచ్చడి బండతో కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయింది. మృతురాలి తల్లి తలుపుల దుర్గ ఆ సమయంలో కేకలు విని అక్కడ వచ్చి చూడగా అశోక్ పరారయ్యాడు. దుర్గ శనివారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సమాచారం తెలుసుకున్న కూచిపూడి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, పామర్రు సీఐ వి.సుభాకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అధిక యాంటీబయోటిక్స్ వినియోగం అనర్థదాయకం

డెప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

నరసరావుపేట: డాక్టర్ల సలహా లేకుండా ఎవరూ యాంటిబయోటిక్స్ మందులు వినియోగించకూడదని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణ నుంచి వరల్డ్ యాంటి మైక్రోబయాల్ రిసిస్టెన్స్ అవేర్‌నెస్ వీక్(డబ్ల్యుఏఏడబ్ల్యు) ర్యాలీ నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ యాంటిబయోటిక్స్‌ను గుడ్డిగా తీసుకోవటం వలన సహజంగా దేశంలో ఉండే రిసిస్టెన్స్ పవర్ తగ్గిపోతుందని హెచ్చరించారు. చిన్న జబ్బులకు సైతం యాంటిబయోటిక్స్ తీసుకోవటం ఏమాత్రం సముచితం కాదు అన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారం తీసుకునేముందు చేతులు శుభ్రంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, ఎన్‌సీడీ పీవో ఎస్.రాజరాజేశ్వరి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

గుంటూరు వైద్య కళాశాలకు బస్సు వితరణ

1999 బ్యాచ్ వైద్య విద్యార్థుల ఉదారత

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ వైద్య విద్యార్థులు కళాశాల ప్రగతికి తమవంతుగా ముందుకు వచ్చారు. ఈ బ్యాచ్‌లో బాహుబలి సర్జన్‌గా గుర్తింపు పొందిన ప్రముఖ న్యూరో సర్జన్, గుంటూరు బ్రింద హాస్పటల్ అధినేత డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు విరాళాలు ఇచ్చారు. వైద్య విద్యార్థులకు కళాశాల నుంచి హాస్టల్‌కు వెళ్లేందుకు అవసరమైన రూ. 40 లక్షలు ఖరీదు చేసే బస్సు కొనుగోలు నగదు సమకూర్చారు. శనివారం డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పుణ్యాల శ్రీనివాసరెడ్డి తండ్రి చంద్రారెడ్డిలు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జున కొండ వెంకటసుందరాచారిని కలిశారు. రూ. 40 లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. హనుమ శ్రీనివాసరెడ్డికి విద్యార్థుల సమస్య గురించి తెలియజేయగానే స్పందించి కేవలం 15 రోజులలో భారీ విరాళం అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.


డాక్టర్ సుందరాచారికి చెక్కు అందజేస్తున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి, చంద్రారెడ్డి

కొనసాగిన శ్రీవిధుశేఖర భారతి స్వామి పర్యటన


ఆర్ అగ్రహారంలోని శ్రీరామనామ క్షేత్రంలో శ్రీశృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి


న్యాయమూర్తి భట్టిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి , కలెక్టర్

నగరంపాలెం: శ్రీ శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతీ స్వామి విజయ యాత్ర మహోత్సవాల్లో భాగంగా నగర పర్యటన మూడో రోజైన శనివారం కూడా కొనసాగింది. సంపత్‌నగర్ శ్రీశృంగేరీ శంకర మఠం శ్రీశారదా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో జగద్గురు మహాస్వామి వారి దివ్య సన్నిధిన కృష్ణ యజుర్వేద హవన పూర్ణాహుతి, కౌథుమ సామవేద హవన పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం సుమారు 150 మంది వేద పండితులతో వేద సభ చేపట్టారు. స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జస్టిస్ భట్టిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిలు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆర్డీఓ కె.శ్రీనివాసరావు వెంట ఉన్నారు. ఆర్ అగ్రహారంలోని శ్రీరామనామ క్షేత్రాన్ని స్వామి సందర్శించారు. శ్రీఆంజనేయస్వామిని దర్శించుకుని, భక్తులు రాసిన శ్రీరామనామ పుస్తకాలను భద్రపరిచిన స్థూపాలకు పుష్పాలను సమర్పించారు. పల్లకి, భవనంలో శంకరకృప వసతి సముదాయన్ని ప్రారంభించారు. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

సాంకేతికతతో వైద్యరంగం కొత్త పుంతలు

గుంటూరు మెడికల్: రానున్న రోజుల్లో రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కనుందని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. యువ వైద్యులు ఈ విప్లవాత్మక మార్పులపై దృష్టి సారించాలని సూచించారు. గుంటూరు మెడికల్ కాలేజ్ జింఖానా ఆడిటోరియంలో జరుగుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సులో కీళ్ల మార్పిడిలో రోబోటిక్ పాత్ర అంశంపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెండు సంవత్సరాల క్రితం వరకు వైద్యరంగంలో రోబోటిక్, ఏఐల పాత్ర అంతంత మాత్రమేనని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రతి విభాగంలోనూ వాటి ముద్ర వేస్తున్నాయని తెలిపారు. ఒక్క కీళ్ల మార్పిడి అంశంలోనే దేశవ్యాప్తంగా 12 వేల రోబోటిక్స్ ఉన్నాయని చెప్పారు. సాంకేతికత వినియోగం పెరిగేకొద్దీ పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని డాక్టర్ నరేంద్ర రెడ్డి వెల్లడించారు.


మాట్లాడుతున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి

హెచ్‌ఐవీ బాధితులకు ఆధునిక చికిత్సలు

గుంటూరుమెడికల్: హెచ్‌ఐవీ బాధితులకు ఆధునిక చికిత్సా పద్ధతులతో నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని ప్రముఖ ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, ధృతి హాస్పిటల్ అధినేత డాక్టర్ రేవూరి హరికృష్ణ అన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 66వ రాష్ట్ర సదస్సులో శనివారం ఆయన 'హెచ్‌ఐవీ ఎసెన్షియల్స్ వైటల్ గైడ్ ఫర్ ఎవిరీ ప్రాక్టీషనర్'పై మాట్లాడారు. ప్రస్తుతం హెచ్‌ఐవీ బాధితులు నెలకు ఇన్ని మందులని మింగుతున్నారని, ఆ పనిలేకుండా ఆరు నెలలకొకసారి ఇంజక్షన్ చేయించుకుంటే సరిపోతుందని వివరించారు. ఈ ఏడాదే ఇండియా మార్కెట్‌లోకి ఇంజక్షన్లు అందుబాటులోకి వస్తాయన్నారు. సీడీ4 కౌంట్‌తో సంబంధం లేకుండా హెచ్‌ఐవీ పాజిటివ్ నిర్ధారణ జరగగానే చికిత్స అందించాలని చెప్పారు. భార్యాభర్తల్లో ఒకరికి హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్నప్పటికీ పిల్లలకు హెచ్‌ఐవీ సోకకుండా మందులు వాడి కనవచ్చని వివరించారు. కొత్తగా ఏఆర్టీ మందులు వాడుతున్న వారిలో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావడం లేదని పేర్కొన్నారు. హెచ్‌ఐవీ నిర్ధారణ, బాధితులకు చికిత్స, ఆధునిక చికిత్సల గురించి వివరించారు.


మాట్లాడుతున్న డాక్టర్ హరికృష్ణ

ఆళ్ల నాగేశ్వరరావుకు గద్దర్ పురస్కారం



తెనాలి: తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరానికి చెందిన మమత స్వచ్ఛంద సేవాసమితి ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్ జాతీయ సాహితీ సేవా పురస్కారానికి తెనాలికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబరు 12వ తేదీన ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. గద్దర్ కుమార్తె, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, సాహితీ అకాడమీ చైర్మన్ డాక్టర్ జీవీ వెన్నెల చేతులమీదుగా ఆళ్లకు పురస్కారం బహూకరిస్తారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్ శనివారం తెలిపినట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు.